ప్రజాశక్తి

శుక్రవారం 19 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

తొలిరోజు 12 నామినేషన్లు

నామినేషన్ వేస్తున్న నెల్లిమర్ల వైసిపి అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు

- అసెంబ్లీ -10, ఎంపి- 2 నామపత్రాలు దాఖలు
- నెల్లిమర్లలో వైసిపి అభ్యర్థి బడ్డుకొండ నామినేషన్
- గజపతినగరం, చీపురుపల్లి, రాజాంలో దాఖలు కాని నామినేషన్లు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యింది. తొలిరోజు గురువారం విజయనగరం పార్లమెంటు స్థానానికి రెండు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటిరోజు నామినేషన్ల ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా పూర్తయ్యింది. ఆర్ఓ కార్యాలయాలకు వంద మీటర్ల దూరంలోనే, పోలీసులు అభ్యర్థుల వాహనాలను నిలిపివేశారు. అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే ఆర్ఓ కార్యాలయాల లోపలికి అనుమతించారు. అన్ని ఆర్ఓ కార్యాలయాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. సిసి కెమేరాల నిఘా మధ్య నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారు. కలెక్టరేట్ సహా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో అభ్యర్థుల సహాయం కోసం హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్కులవద్ద నామినేషన్ పత్రాలను ఎఆర్ఒలు, ఇతర అధికారులు ముందుగా పరిశీలించారు. మొత్తం నామినేషన్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేశారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే, కలెక్టరేట్‌లో నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ప్రారంభించారు. తొలిరోజు ఇద్దరు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. యుగ తులసి పార్టీ తరపున పార్లమెంటు అభ్యర్థిగా శంబాన శ్రీనివాసరావు, సమాజ్‌వాది పార్టీ తరపున ఎస్.అచ్చియ్యనాయుడు నామినేషన్లు వేశారు. వీరిద్దరూ చెరో సెట్‌ను దాఖలు చేశారు. ముందుగా అభ్యర్థుల నామినేషన్ పత్రాలను హెల్ప్ డెస్క్ వద్ద పార్లమెంటు స్థానం ఎఆర్ఒ సుమబాల తనిఖీ చేశారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యింది.

విజయనగరం తాహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను విజయనగరం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ప్రారంభించారు. ఇద్దరు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. సమాజ్‌వాది పార్టీ తరపున పెనుమత్స కరుణాకర్, స్వతంత్ర అభ్యర్థిగా మండల శ్రీనివాసరావు ఒక్కో సెట్ (మిగతా..3లో)

మన్యంలో బోణీ

కురుపాం : నామినేషన్లు మొదటి రోజు కురుపాం నియోజకవర్గంలో నిమ్మక జయరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ గురువారం దాఖలు చేసినట్టు కురుపాం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి. వి. రమణ తెలిపారు.

నేడు సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స నామినేషన్

రాష్ట్ర కార్యదర్శి వివిఎస్ఆర్ రాక

ప్రజాశక్తి-పార్వతీపురం

సిపిఐ, కాంగ్రెస్ మద్దతుతో ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంటు అభ్యర్థి పి.అప్పలనర్స శుక్రవారం ఉదయం 10గంటలకు నామినేషన్ వేయనున్నారు. ఈమేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు తెలిపారు. అప్పలనర్స విద్యార్థి స్థాయి నుండి, నిరుద్యోగ గిరిజన సమస్యల పైన నిరంతరం పోరాడుతూ సుమారుగా 26 ఏళ్ల ప్రజా ఉద్యమనేతగా గిరిజన ప్రజల మనలు పొందారని అన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాతబస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా చేరుకొని నామినేషన్ వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవు తారని తెలిపారు. కార్మికులు కర్షకులు, గిరిజనులు, మేధావులు, అభ్యుదయవాదులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

ఓటు వేయడం పౌరుని బాధ్యత

అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఓటు వేయడం ప్రతీపౌరుడి బాధ్యతని అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధమని ఆయన పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలాజీ క్లాత్ మార్కెట్ వద్ద బట్టల షాపుల యజమానులకు, వర్కర్లకు గురువారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో (మిగతా..3లో)

పురుగుల మందు తాగి పిఇటి ఆత్మహత్య

పోక్సో కేసు నమోదుతో దారుణం

మృతిచెందిన శ్రీనివాసరాజు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

లక్కవరపుకోటలోని ఓ ప్రైవేటు స్కూలులో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొత్తవలస మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన పాకలపాటి శ్రీనివాసరాజు (47) గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఆయన పిఈటిగా పనిచేస్తూ విద్యార్థులకు కరాటే లో శిక్షణ ఇస్తూ ఉండేవాడు. ఈనెల 13న మండల కేంద్రంలో ఆడుకుంటున్న 8ఏళ్ల బాలికను తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించినట్లు బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎల్.కోట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ చిన్నారుల కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు ఆయనకు దేహశుద్ధి చేశారు. ఈ నేపథ్యంలో 14వ తేదీ ఉదయం శ్రీనివాసరాజు ఎస్.కోట ఆర్‌టిసి కాంప్లెక్సువద్ద పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిహెచ్‌సిలో చేర్పించారు. మరుచటిరోజు ఉదయం అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు చెబుతున్నారు. మరోవైపు పోలీసులు అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరాజు గురువారం లక్కవరపుకోట సమీపాన విశాఖ అరకు రహదారిలో వాడుకలో లేని భవనం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని శంగవరపుకోట ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి పార్వతీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడంతో మనస్థాపం చెందిన తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పార్వతీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శ్రీనివాసరాజు మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజుకు ఎందుకు రక్షణగా లేరని పలువురు ప్రశ్నిస్తున్నారు.

యుపిఎ-1లో కమ్యూనిస్టుల చొరవతో ఏర్పడిన 2005 మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టానికి గడిచిన పదేళ్లలో అనేక తూట్లు పడ్డాయి. శ్రమకు తగ్గ కూలిరావడం లేదు. పని ప్రదేశాల్లో నీరు, నీడ కల్పించాలన్న నిబంధన అటకెక్కింది. వేసవి అలవెన్సులు, పార, గునపాం వంటి పనిముట్లకు ఇచ్చే అద్దెలనూ పూర్తిగా రద్దుచేశారు. మరోవైపు రెండుపూటలా పనిపెట్టడంతో కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో, ఉపాధి కూలీలు శ్రమదోపిడీకి గురౌతున్నారు.

ఉపాధి పనులు కమ్యూనిస్టుల చొరవే

- బిజెపి వచ్చాక నీరు, నీడ కరువు
- నిర్వీర్యం చేసేందుకు కుట్ర
- నోరు మెదపని వైసిపి, టిడిపి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లా వార్షిక ఆదాయంలో ఆఖరి స్థానం. తలసరి ఆదాయమూ అత్యల్పమే. అక్షరాస్యతలో వెనుకబాటు. వీటన్నింటికీ పాలకుల నిర్లక్ష్యమే కారణం. పుష్కలమైన సాగునీటి వనరులు ఉన్నా, అవసరానికి తగట్టు వర్షపాతం నమోదవుతున్నా వాటిని ఒడిసిపట్టి సాగునీటి అవసరాలు తీర్చేందుకు పాలకులు చొరవ, ముందుచూపు లేకపోయింది. దీంతో, జిల్లాలో ఎంతో సారవంతమైన భూములు ఉన్నా వాటిని సాగుచేసేందుకు అవకాశం లేకపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో 2005లో అమల్లోకి వచ్చిన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం జిల్లా పాలిట ఓ వరమే. కొన్ని దశాబ్ధాల కాలానికి ముందుకెళ్తే ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఉమ్మడి విజయనగరం జిల్లాలో అత్యధిక వలస కూలీలు ఉండేవారు. కనీస అవసరాలు తీర్చుకోలేని పేదలెందరో. పాలేర్లుగా ఎక్కువగానే తారస పడుతుండేవారు. ఇటువంటి పరిస్థితుల్లో 2005లో కమ్యూనిస్టుల మద్ధతుతో వచ్చిన యుపిఎ-1 ప్రభుత్వం కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా ఏటా వంద రోజుల పని గ్యారెంటీ చేశారు. పని కోరుకునేందుకు జాబ్‌కార్డులు జారీచేశారు. కోరిన వెంటనే పని కల్పించాలని, సకాలంలో పని కల్పించకపోతే నష్టపరిహారం (మిగతా..3లో)

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వం సంక్షేమ పథకాలు వైసిపితోనే సాధ్యమని మరోసారి వైసిపిని గెలిపించాలని జిల్లా పరిషత్ ఛైర్మెన్, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటి కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం నెల్లిమర్ల రైల్వే బ్రిడ్జి ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఎన్నికల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పి ఛైర్మన్, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు యధావిదంగా కొనసాగాలంటే రెండోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. సీఎం జగన్ ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, గత సంవత్సరం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారని వాటి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మరో రెండు సంవత్సరాల్లో పూర్తి కాబోతుందని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వల్ల

ఓటును అభ్యర్థిస్తున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ఈ ప్రాంత యువతకి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. వచ్చే నెల13వ తారీకున జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో నెల్లిమర్ల నియోజకవర్గం ప్రజలకు కేటాయించిన రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా బడ్డుకొండ అప్పల నాయుడును, ఎమ్‌పిగా బెల్లాన చంద్రశేఖర్‌ని గతంలో కంటే అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపిపి అంబళ్ళ సుధారాణి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ళ శ్రీరాముల నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, పూసపాటి రేగ ఏఎంసి ఛైర్మెన్ చిక్కాల అరుణ కుమారి, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబ శివరావు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతి వాడ సత్య నారాయణ, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. పట్టణంలోని గొల్లవీధిలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధి చేసిన వైసిపికి మద్దతు ఇవ్వాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్నికల

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

నెల్లిమర్ల: మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రచారానికి వెళ్లిన శంబంగికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, శంబంగి శ్రీకాంత్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మరోసారి ఆదరించండి: ఎమ్‌పి

చీపురపల్లి: అందరి కష్టాల్లోనూ అందుబాటులో ఉంటానని తనను మరోసారి ఆదరించాలని ఎమ్‌పి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న వార్డులలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లగా మంత్రి బొత్స సత్యనారాయణ, తాను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించామని అన్నారు. తనను, బొత్స సత్యనారాయణను గెలిపించినట్లయితే అందరి కష్ట సుఖాలలో తోడుంటామని హామీ ఇచ్చారు.

వైసిపి పాలనలో భూములు లూటీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వైసిపి పాలనలో భూములు లూటీ అయ్యాయని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి అన్నారు, గురువారం పట్టణంలోని పొలమరశెట్టి వీధిలో శివ గౌరీ కమ్యూనిటీ భవనంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొలమర శెట్టి వీధికి చెందిన 70 కుటుంబాలు టిడిపిలో చేరాయి. అనంతరం ఆమె మాట్లాడుతూ టిడిపిలో చేరికలు ఇదొక ప్రభంజనమని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి

దత్తిరాజేరు : సుంకరి సత్యంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్

అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుబ్బలక్ష్మి, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ సంతోష్ కుమారి, పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

దత్తిరాజేరు : రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, దీనికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని టిడిపి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పాచలవలస, చినకాద గ్రామాలకు చెందిన 270 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి ఆయన టిడిపి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పాచలవలసలో మును పెన్నడూ లేనిది వైసిపి నుంచి ఎక్కువ మంది బయటకు వెళ్లడం పట్ల మండలంలో చర్చ జరుగుతోంది. సుంకరి సత్యం ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బోడసింగి సత్తిబాబు, ఎంపిటిసి వంగపండు కృష్ణమూర్తి, గుషిడి జగన్నాథం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్‌పేటలో టిడిపి ఎన్నికల ప్రచారం

గుర్ల: ప్రజలకు మేలు చేసే టిడిపిని గెలిపించాలని రాష్ట్ర

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి

ఎస్‌కోట: మహిళను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోళ్ల లలిత

బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసి నాయుడు కోరారు. గురువారం ఎస్ఎస్ఆర్‌పేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి టిడిపి సూపర్ 6 పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు చనమాల మహేశ్వరరావు, జిల్లా ఐటిడిపి అధ్యక్షులు కె విమలరాణి, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు, టిడిపి మండల ప్రధానకార్యదర్శి పిల్ల అప్పలనాయుడు, కె సూర్యనారాయణ. కె కృష్ణ, కె మధుబాబు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థిని తనిఖీ చేస్తున్న వైద్యుడు

ఉచిత ఉపకరణాల పంపిణీకి ఎంపిక

ప్రజాశక్తి- డెంకాడ

సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో గురువారం వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీకు ఎంపికకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ లోవరాజు, ఎంఇఒ-2 రాధాకృష్ణ మాట్లాడుతూ వికలాంగ పిల్లల్లో ప్రత్యేక సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించి వారిని ప్రోత్సహిం చాలని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనున్న ఈ ఉపకరణాలను పిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య సహా కోఆర్డినేటర్ భారతి, డాక్టర్లు తాజ్ కుమార్, సిహెచ్‌కె నాయుడు, డెంకాడ పిహెచ్‌సి సిబ్బంది, ఐదు మండలాల సహిత విద్య ఉపాధ్యాయులు, ఐఆర్‌పిలు డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం, నెల్లిమర్ల, విజయనగరానికి చెందిన 3 నుండి 18 సంవత్సరాల వయస్సుగల 150 మంది వికలాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాలంటీర్ల రాజీనామాలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో వాలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మండలంలో 304 మంది వాలంటీర్లు ఉండగా, ఇప్పటి వరకు 59 మంది రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ నిశ్చలత తెలిపారు. గురువారం పాటూరు గ్రామంలో 12 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి సంధ్యకు రాజీనామా పత్రాలను అందజేశారు.

28 మంది వాలంటీర్లు రాజీనామా

బొండపల్లి : మండలంలోని వివిధ సచివాలయ పరిధిలోని 28 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. గురువారం మండలంలో బొండపల్లిలో 22 మంది, బోడసింగిపేట పంచాయతీ పరిధిలో ఐదుగురు, ఓంపల్లి సచివాలయ పరిధిలో ఒకరు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

వాలంటీర్ల జీవితాలతో ఆటలొద్దు : లోక్‌సత్తా

బొబ్బిలి: వాలంటీర్ల జీవితాలతో ఆటలు ఆడవద్దని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్.. రాజకీయ పార్టీల నాయకులను కోరారు. వాలంటీర్లతో రాజకీయాలు చేసేందుకు అధికార పార్టీ నేతలు రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తే, కూటమి అధికారంలోకి వస్తే వేతనం రూ.10 వేలకు పెంచుతామని టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించడం చూస్తే.. వారిని ఎలా వాడుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. రాజకీయ అవసరాలకు వాలంటీర్లను వాడుకోవద్దని సూచించారు.

ఉత్సవాల్లో పూజలు చేస్తున్న సర్పంచ్ రాజేశ్వరి దంపతులు

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భజన, కోలాటం, కాంగో నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.

నీటి పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు గురువారం నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ గొర్రెల రాంబాబు. కెజిబివి పిఇటి అరుణకుమారి, వేపాడ గ్రామ సచివాలయ మహిళా కానిస్టేబుల్ పాల్గొన్నారు.

25లోగా నామినేషన్లు : ఆర్‌ఒ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ నెల 25లోగా నామినేషన్లు వేసుకోవాలని నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు తెలిపారు. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 13న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈనెల 18నుంచి ఆయా పార్టీల అభ్యర్థులు నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి నామి నేషన్‌లు 25 వరకు దాఖలు చేయాలని, పరిశీలన 26న మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని, 29న నామినేషన్లు ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. గురువారం ఎమ్మెల్యే అభ్యర్థిగా బడ్డుకొండ అప్పలనాయుడు మూడు సెట్స్ నామినేషన్లను వైసిపి తరపున దాఖలు చేసారని వాటిలో ఒక నామినేషన్ ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు ప్రతిపాదితులుగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు సతీమణి పద్మావతి కూడా రెండు సెట్ల నామినేషన్లను వేశారన్నారు. మూడు గంటలకు మొత్తం ఐదు నామినేషన్లు స్వీకరించామని ఎఆర్‌ఒ డి. ధర్మరాజు తెలిపారు.

మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న శారద పరిశ్రమ ప్రతినిధులు

మరుగుదొడ్లు ప్రారంభం

కొత్తవలస: కంటకాపల్లి వద్ద శారద మెటల్స్ కంపెనీ రూ.30 లక్షలతో నిర్మించిన రెండు మరుగుదొడ్లను గురువారం కంపెనీ హెచ్‌ఆర్ సీనియర్ జిఎం ప్రభాత్ మోహన్ ప్రారంభించారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇద్దరు వికలాంగులకు రెండు బ్యాటరీ ట్రై సైకిళ్ల యాజమాన్యం అందజేసింది. ఈ సందర్భంగా ప్రభాత్ మోహన్ మాట్లాడుతూ కంపెనీ పరిసర ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ సిస్టం ద్వారా ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఇంకా అవసరమైన వనరులను సమకూర్చడానికి యాజ మాన్యం ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ జిఎం కె.విజయ్‌భాస్కర్, హెచ్‌ఆర్ డిజిఎం హెచ్.సన్యాసిరావు, ఇఎస్‌హెచ్ ఎజిఎం సూర్య భాస్కర్, హెచ్‌ఆర్ ఎజిఎం మురళీకృష్ణ, హెచ్‌ఆర్ సహాయక మేనేజర్ జి.శంకర్రావు, హెచ్‌ఆర్ ఆఫీసర్ కె.సంతోష్ కుమార్, సివిల్ ఇంజినీర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేటకు చెందిన మీసాల, పతివాడ, పిన్నింటి, పతివాడ, కొండేటి వారి కుటుంబాల నుండి పలువురు వైసిపి తీర్థం పుచ్చుకొన్నారు. ఈ మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో వారికి గురువారం కండువాలు కప్పి వైసిపి నాయకులు పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలన నచ్చి చాలా మంది పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, గవిడి సురేష్, మీసాల బాలు, జుజ్జూరు రవిశంకర్ వర్మ, మీసాల సాయి, మీసాల సత్యన్నారాయణ, మీసాల గౌరీ, మీసాల హరి, రాంబాబు ఆకుల పేట నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

ఉపాధి పనులు కమ్యూనిస్టుల చొరవే

కూడా చెల్లించాలని ఈ చట్టంలో పేర్కొన్నారు. పొట్ట కూటి కోసం ఊరుకాని ఊళ్లు వలసపోయే కుటుంబాలవారికి ఇది ఎంతో ఆసరాగా నిలిచింది. స్థానికంగానే వంద రోజులు పని గ్యారెంటీ దొరుకుతుండడంతో గతంతో పోలిస్తే వలసలు తగ్గాయి. సేద్యానికి ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోకపోయినా, పంటలు పెద్దగా కలిసి రాకపోయినా, పండిన పంటలకు పెద్దగా గిట్టుబాటు ధర పలకపోయినా, పెరిగిన ధరల ప్రవాహంలో కొట్టుకుపోయినా ఏడాదిలో వంద రోజుల పని గ్యారెంటీ కావడంతో జిల్లాలో మెజార్టీ ప్రజానీకానికి ఉపాధి చట్టం ఎంతో భరోసా ఇచ్చింది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 3.82లక్షలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 1.68లక్షల చొప్పున మొత్తం ఈ రెండు జిల్లాల్లో 5.5లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరంతా పని దినాలను పూర్తిస్థాయిలో ఉపయోగించు కుంటున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఒక్క విజయనగరం జిల్లాలోనే సుమారు రూ.300కోట్ల మేర కూలీలకు సమకూరింది. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఇదే స్థాయిలో డబ్బులు చేతికందాయి. ఇందువల్లే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కొంతలో కొంతైనా కళకళలాడుతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. విజయనగరం జిల్లాలో ఈ ఏడాది 2.10లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 2.18లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 1.20లక్షల పనిదినాల లక్ష్యానికిగాను సుమారు 2.50లక్షల పనిదినాలు కల్పించి 6వ స్థానంలో నిలిచింది. అంతెందుకు 2020 నుంచి 2021 వరకు సుమారు రెండేళ్లపాటు కరోనా వల్ల విధించిన లాక్‌డౌన్ వల్ల దేశమంతా అతలా కుతలమైనా గ్రామాల్లోని ఉపాధి కూలీలు మాత్రం భద్రంగా బతికేశారు. ఇలా ఈ చట్టాన్ని ఉపయోగించడంలో విజయనగరం ఉమ్మడి జిల్లా దేశానికే ఆదర్శంగా నిలిచింది. అందుకే ఇక్కడి జిల్లా కలెక్టర్లకు గవర్నర్‌తో ప్రశంసలు, జాతీయ ఎన్నో అవార్డులు, రివార్డులు సైతం లభించాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు శత విధాలా ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా రెండో సారి అధికారంలోకి వచ్చాక ఉపాధి చట్టానికి ఏటా రూ.కోట్లు నిధులు కోత విధిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఉపాధి పనులకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.73వేల కోట్లను కుదించింది. ఈ ప్రభావం దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాలతోపాటే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలపైనా పడుతుంది. దీని నుంచి దృష్టిమళ్లించేందుకు గత ఏడాది నుంచీ యాప్ ఆధారిత హాజరు అమల్లోకి తీసుకొచ్చింది. రెండు పూటలా పని తప్పనిసరి చేసింది. దీంతో, శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. విజయనగరం జిల్లాలో 2021-22లో ఒక్కపూట పనిచేస్తే కార్మికుడి వేతనం రూ.250 నుంచి రూ.257 అందగా, 2022-23లో రెండు పూటల పనిచేసినా రూ.200కు మించలేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ కూలిరేటు కాస్త అటు ఇటు అయినా వ్యత్యాసం దాదాపు ఇంతే. ఏప్రిల్ 1నుంచి కూలిరేటు రూ.300గా ప్రకటించినప్పటికీ ఆచరణలో రూ.260 మించి రావడం లేదు. కొంతమంది రూ.30 నుంచి రూ.50 చొప్పున కూడా కూలి వర్తింపజేస్తుండడం గమనార్హం. వేసవి అలవెన్సులను పూర్తిగా రద్దుచేశారు. పని ప్రదేశాల్లో నీరు, నీడ కల్పించాలని చట్టంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడం లేదు. పనిలో ఉపయోగించే పార, గునపాం, తట్టలు, గమేలాలు వంటి పనిముట్లకు గతం మాదిరిగా మెయింటెనెన్స్ ఛార్జీలను ఇవ్వడం లేదు. ఉపాధి కూలీలను ఇలా ఇబ్బంది పెట్టడం ద్వారా పని కోరుకునేవారి సంఖ్యను తగ్గించి, సంఖ్య తగ్గింపును బూచీగా చూపించి ఉపాధి చట్టాన్ని పూర్తిగా దూరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుంది. కేంద్రం తెచ్చిన నిబంధనల వల్ల కండలు కరిగిపోతున్నా అందుకు తగ్గ ఫలితం దగ్గడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లాలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కూలీలంతా కేంద్రం కుట్రలపై ఐక్యంగా పోరాడడమే శరణ్యంగా మారింది.

తొలిరోజు 12 నామినేషన్లు

చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

నెల్లిమర్ల నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యింది. తొలిరోజు ఇద్దరు అభ్యర్థుల నుంచి నెల్లిమర్ల తాహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఒ ఎం.నూకరాజు నామినేషన్లను స్వీకరించారు. వైసిపి అభ్యర్థులుగా బడ్డుకొండ అప్పలనాయుడు 3 సెట్లను, బడ్డుకొండ పద్మావతి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

శృంగవరపుకోట నియోజకవర్గంలో ఇద్దరు అభ్యర్థుల నుంచి రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ నామినేషన్లను స్వీకరించారు. జాతీయ జనసేన పార్టీ తరపున యాళ్ల వెంకటరావు, స్వతంత్ర అభ్యర్థిగా కొట్యాడ లోకాభిరామకోటి ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు.

చీపురుపల్లి, రాజాం, గజపతినగరం నియోజకవర్గాల్లో తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు బి.శాంతి, ఎల్.జోసెఫ్, ఎం.వి.సూర్యకళ, ఎఆర్ఒలు నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా ముగడ నామినేషన్

బొబ్బిలి : బొబ్బిలి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ముగడ వెంకటరమణ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం ఆర్‌డిఒ కార్యాలయానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీకి నామినేషన్ పత్రాలను అందజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా మరో నామినేషన్ పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ అధిష్టానం బి-ఫాం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటామని ఆయనచెప్పారు. ఆయనతో కాంగ్రెస్ నాయకులు వెంగళ నారాయణరావు, ఇతర నాయకులు ఉన్నారు.

ఓటు వేయడం పౌరుని బాధ్యత

తామంతా తప్పకుండా ఓటేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. మానవ హారాన్ని నిర్వహించారు. ఓటువిలువను తెలుపుతూ నినాదాలు చేయించారు.

అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ, మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటలు మధ్య ఎప్పుడైనా ఓటుహక్కును వినియోగించుకోవచ్చునని చెప్పారు. ఓటు విషయంలో ఏమైనా సమస్య వస్తే, తమ బిఎల్ఒను, ఎన్నికల రోజు ఓటు వేయడంలో ఇబ్బందులు ఎదురైతే ప్రిసైడింగ్ అధికారిని సంప్రదించాలని సూచించారు. ప్రజలంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లనూ చేసిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ తిరుమల రావు, స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, బాలాజీ మార్కెట్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరావు, స్వీప్ రిసోర్స్ పర్సన్ పద్మనాభం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశలన్నీ 'పల్లా' పైనే

ప్రజాశక్తి-పాలకొండ

తెలుగుదేశం పార్టీలో కీలక నేతగా ఉన్న పల్లా కొండలరావు పైనే కూటమి అభ్యర్థి జయకృష్ణ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయని పట్టణంలో చర్చించుకుంటున్నారు. మేజర్ పంచాయితీ సర్పంచ్‌గా, ఎంపిటిసిగా నగరపంచాయితీ చైర్మన్‌గా గతంలో వ్యవహరించిన కొండబాబు పట్టణంలో టిడిపికి పెద్ద దిక్కుగా ఉన్నారు. పట్టణంలో సుమారు 20 వేలకు పైగా ఓటర్లు ఉండగా ఆయన చేతిలో కొన్ని వార్డులు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ. మొదటి నుండి జయకృష్ణకు మద్దతుగా ఉన్న ఆయన టిడిపికి సీటు కేటాయించకపోవటంతో కొంత డీలా పడినట్లు తెలుస్తుంది. మళ్లీ టిడిపికి మద్దతు తెలిపిన జనసేన తరపున అభ్యర్థిగా పోటీ చేస్తున్న జయకృష్ణను గెలిపించేందుకు ఆయన రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. అదేవిధంగా జయకృష్ణకు వ్యతిరేకంగా ఉన్న అసమ్మతి నేతలతో కూడా ఈయనకు సత్సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వారితో కూడా మంతనాలు జరుపటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా పల్లా కొండలరావు ఈ సారి ఎన్నికల్లో కూటమికి గట్టిగా పనిచేయాలని సిద్దమైనట్లు ఆయన అనుచరులు చెప్పున్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు కరువు

ప్రజాశక్తి - వీరఘట్టం

పదికాలా లు భవనాలు పటిష్టంగా ఉండా లంటే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. కానీ ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదు. గుత్తేదారులిచ్చే కాసులకు అధికారులు కక్కుర్తిపడడంతో పనులు జరిగినప్పుడు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. దీంతో గడువు ముందే భవనాలు శిథిలావసకు చేరుకుంటున్నాయని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇందుకు నిదర్శనం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 15.43 లక్షలతో నిర్మిస్తున్న కెమిస్ట్రీ ల్యాబ్ భవనం పనులే. ఈ భవనం పునాదుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఎన్ని లక్షల రూపాయలు ఖర్చు చేసినా ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఉద్దవోలు, దళాయివలస తదితర గ్రామాల్లో గురువారం స్థానిక ఎస్ఐ అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీస్ కవాతు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో డిపార్టెంట్కు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ టీమ్ వాహన తనిఖీలు

ప్రజాశక్తి - మక్కువ

ఎన్నికలవేళ అక్రమంగా మద్యం, డబ్బు ఇతర వస్తువులు తరలింపును నిరోధించేందుకు గురువారం ఎస్ఎస్ టీం తనిఖీలు చేపట్టారు. స్థానిక ఆర్ఎంఎం సెంటర్ వద్ద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బృందం వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

21 మంది వాలంటీర్లు రాజీనామా

జియ్యమ్మవలస : మండలంలోని కుదమ,పెదబుడ్డిడి సచివాలయం పరిధిలో పని చేస్తున్న 21 మంది వాలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. విధులను ఉండి స్వచ్ఛందంగా తప్పుకున్నట్లు వారు తెలిపారు.

పాతకక్షతో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు గ్రామానికి చెందిన కొచ్చెర్ల సన్యాసిరావుపై గురువారం ఆరిపాక సంతోష్ దాడి చేశాడు. పాతకక్షల నేపథ్యంలో సన్యాసిరావు ఇంటికెళ్లి కత్తితో పీక కోశాడు. తీవ్రంగా రక్తస్రావమైన ఆయన్ను కుటుంబ సభ్యులు కోటపాడులోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్న వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు.

అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వ్యక్తి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో అక్రమంగా మద్యం తరలిస్తూ ప్రత్యేక పోలీసు బృందానికి పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి నరసింహమూర్తి తెలిపారు. గురువారం తూరుమామిడికి చెందిన వి.శ్రీనివాస్ నుంచి నాలుగు ఫుల్, ఏడు క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జ్‌వారి కోర్టులో

O.S.143/2023

Between:

పుప్పాల శ్రీనివాసరావు ......వాది

And:

కాకి శేఖర్ ....ప్రతివాది

ప్రతివాది :- కాకి శేఖర్ S/o సత్యనారాయణ, వ్యాపారం, లావుడి వీధి, సాలూరు గ్రామం, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పలుమార్లు కోర్టువారు దావా నోటీసులు జారీ చేసినప్పటికీ అందుకోనందున కోర్టువారు ఈ పేపరు ద్వారా మీకు దావా సమను జారీ చేసి పై దావాను **తే 13-5-2024దీ** నాటికి వాయిదా వేసినారు. ఆ తేదీనాడు మీరు పై కోర్టులో వ్యక్తిగతంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై **ఉదయం 10-30 ని॥**లకు మీ ఆక్షేపణలు తెలియపర్చవచ్చును. లేని యెడల మీ పరోక్షములో శ్రీ కోర్టువారు తీర్పు యిచ్చెదరని యిందు మూలంగా తెలియజేయడమైనది.

శ్రీ లావుడి ఏకదంతేశ్వర రావు

న్యాయవాది,

లావుడివీధి, సాలూరు,

సెల్ : 9440913367

నేరాలు ఘోరాలు

వైసిపి ప్రచార వాహనం ఢీకొని బాలుడు దుర్మరణం

ప్రజాశక్తి - వంగర, రేగిడి

రాజాం మండల కేంద్రంలో వైసిపి ప్రచార వాహనం ఢీకొని లక్ష్మయ్యపేటకు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు భరద్వాజ్ మృతి చెందాడు. రాజాం పట్టణంలోని బొబ్బిలి కూడలిలో వైసిపి అభ్యర్థి ప్రచార వాహనం అతివేగంగా వస్తూ బాలుడి మీదు దూసుకుపోయింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాలుడి కుటుంబసభ్యులు ఆస్పత్రి ఆందోళన చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ట్రక్కర్ బోల్తా ; ఒకరు మృతి

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో రస్తాకుంటుబాయి వద్ద జీపు అదుపు తప్పి కల్వర్టుకు ఢీ కొనడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని భద్రగిరి, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాలకు 108 ద్వారా తరలించి చికిత్స అందించారు. గ్రామస్తులు అందించిన వివరాల ప్రకారం.. కురుపాం మండలంలోని పి.లేవిడి, కాశీతాడ గ్రామాల నుంచి కొమరాడ మండలం పూడేసు శుభకార్యానికి గురువారం మధ్యాహ్నం జీపులో వెళ్తుండగా రస్తాకుంటుబాయి వద్ద జీపు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీ కొంది. జీపులో ప్రయాణిస్తున్న పి.లేవిడికి గ్రామానికి చెందిన కిమిడి కమలమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందిగా పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన పి.లేవిడికి చెందిన బొమ్మన సగుణ, పెద్దింటి బుజంగరావు, సుజాత, పాలక శశిరేఖ, నిమ్మక సుమన్, కాశీతాడకు చెందిన గంటా పవన్, నేమలపురి తేజలను కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ డాక్టర్ శోభరాణి, సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన సుగుణ, చైతన్య, శశిరేఖను భద్రగిరి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు.

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అయిన విజయనగరం పట్టణం మరియు జిల్లా, దక్కినవీధి, డోర్ నెంబర్ 3-1/6-2 కాపురస్తురాలు లేట బూర్లె శశిధర్ గారి భార్య బూర్లె లక్ష్మి పావని గారు ఇచ్చిన బోగట్టా ప్రకారము నా క్లయింట్ భర్త గారు 2004వ సంవత్సరములో దస్తావేజు నెంబర్లు 4784/2004 మరియు 4785/2004 రెండు స్థలములు కొనుగోలు చేసియున్నారు. నా క్లయింట్ భర్త గారు తేదీ 06-04-2010వ సంవత్సరములో చనిపోయినారు. నా క్లయింట్ కుటుంబ అవసరాల నిమిత్తము సదరు ఇంటి స్థలములను విక్రయించుటకు నిర్ణయించగా సదరు రెండు ఒరిజినల్ దస్తావేజులు కనపడ లేదు. సదరు దస్తావేజులు కొరకు నా క్లయింట్ ఇంటిమొత్తము వెతికి చూసిన ఎటువంటి ఫలితము లేక పోయినది. సదరు స్థలముల యొక్క ఒరిజినల్ దస్తావేజులు పోయినవి అని నిర్ధారించుకొని నా క్లయింట్ 1వ పట్టణ పోలీస్ స్టేషన్ వారికి అప్లికేషన్ నెంబర్ MDLO 12400418832 ట్రాన్సక్షన్ ID :TAMLDO 12400418832 తేది 18-04-2024 న మీ సేవ ద్వారా కంప్లైంట్ ఇచ్చి యున్నారు. నా క్లయింట్ యొక్క సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైన దొరికిన యెడల క్రింది ఫోన్ నెంబరికి అందజేయ వలెను. మరియు అట్టి దస్తావేజులను ఎవరైనా దుర్వినియోగపరచే ప్రయత్నాలు చేసినను చట్టరీత్యా శిక్షార్హులు అని ఈ ప్రకటన మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు

సంఘంరెడ్డి మధుసూధన రావు,

న్యాయవాది, విజయనగరం.

Cell:9440163944, 9494325581

ఓట్ల జాతర వేళ... ఓ ప్రశ్న

ఓట్ల జాతర వచ్చింది
ప్రజాస్వామ్య భారతంలో
సకల జనుల సమానత్వం
సమాధి కాబడుతున్న వేళ..

మతోన్మాదుల ఏలుబడిలో
సర్వమత సమోన్నత భరత భూమిపై
విరబూసిన సమైక్యత ఇంద్రధనస్సు
రంగులు వెలసి వెలవెలబోతున్నవి

ప్రశ్న .... ప్రశ్నించుకుంది
ఓ క్షణం ఆలోచించింది..
ప్రశ్నిస్తే జిఎస్‌టి కట్టాలేమోనని భయం
ఉపా కేసు పెడతారేమోనని
మనసంతా ఒకటే ఆందోళన
కళ్లు తెరిస్తే తీహార్ జైలు..

అన్నపూర్ణ ఆంధ్రలో రాజకీయం
మోడీ మెడలో మాయాహారమై...
అవకాశవాదంతో ఆత్మగౌరవం వదలి
నీరులేని కొలనులో కలువ పువ్వుపై
నీటి బుగ్గలులా మూడు పార్టీలు...
రంగులు మార్చిన ఊసరవెల్లే
సిగ్గుతో తల దించుకునేలా ఉంది

అంబానీ, అదానీ ఆస్తుల కుప్పలు
కార్మికుల అప్పుల తిప్పలు
పిడికెడు మెతుకులు పండించే రైతు
ప్రాణత్యాగంతో పరిశుద్ధుడైన వేళ
విశ్వవిపణిలో బ్రాండ్ అంబాసిడర్
పట్టాలు పట్టుకుని నేటి యువకులు
పనిలేక వలస పక్షులై ఎగిరిపోతే
గుండె ధైర్యం చేసి ప్రశ్న గొంతెత్తింది

- రెడ్డి శంకర్రావు
94943 33511

కుటుంబ సభ్యులు, ఎమ్‌పి బెల్లానతో కలిసి నామినేషన్ వేసేందుకు వచ్చిన వైసిపి అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు

అట్టహాసంగా బడ్డుకొండ నామినేషన్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల అసెంబ్లీ వైసిపి అభ్యర్థిగా బడ్డుకొండ అప్పలనాయుడు అట్టహాసంగా నామినేషన్ వేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ వేశారు. అంతకముందు బడ్డుకొండ సతీమణి పద్మావతి కుమారులతో కలిసి డమ్మీగా నామినేషన్ వేశారు. ఈ నేపథ్యంలో ముహూర్తం ప్రకారం ఎమ్మెల్యే అభ్యర్థిగా బడ్డుకొండ అప్పల నాయుడు, ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబు, వైసిపి నాయకులు పతివాడ అప్పల నాయుడు, కందుల రఘుబాబుతో కలిసి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు, ఎఆర్ఒ డి. ధర్మరాజుకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి బొడ్డుకొండ అప్పల నాయుడు మీడియాతో మాట్లాడుతూ వచ్చే నెల జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి మూడోసారి ఎమ్మెల్యే కావడం ఖాయమన్నారు. ప్రతి పక్షాలు కూటమిగా ఏర్పడి రాష్ట్ర ప్రజలను తప్పు దోవ పట్టించి మోసం చేయాలని అనేక రకాలుగా జిమ్మిక్కులు చేస్తున్నారని వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. తన మీద పోటీగా నిలుస్తున్నవారు ప్రజలకు ఏమీ చేశారని ఓట్లడుగుతారని ప్రశ్నించారు. ఎన్నికలు ముగిసిన తరువాత విదేశాలకు వెళ్లిపోయారని నియోజక వర్గం ప్రజల బాగోగులు తనే చూడాలని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బెల్లాన చంద్ర శేఖర్‌ని ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసే అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరారు.

నామినేషన్‌కి భారీగా తరలివచ్చిన జనం

ఎమ్మెల్యే అభ్యర్థిగా బడ్డుకొండ అప్పల నాయుడు నామినేషన్ కార్యక్రమానికి నియోజక వర్గంలో నాలుగు మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో సర్పంచులు, ఎంపిటిసిలు నాయకులు, కార్యకర్తలు భారీగా ద్విచక్ర వాహనాలు, ఆటోలతో హాజరై తమ మద్దతు తెలిపారు.

మేం రాజీనామా చేయం

- తెగేసి చెబుతున్న 19 మంది వాలంటీర్లు
- 56 మందిలో 37 మంది మాత్రమే రాజీనామా
- చర్చనీయాంశంగా మారిన వ్యవహారం

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం మేజర్ పంచాయతీలోని కొంతమంది వాలంటీర్లు రాజీనామాలు చేయమని తెగేసి చెబుతున్నారు. రెండు సచివాలయాల పరిధిలో 56 మంది వాలంటీర్లు ఉండగా ఇందులో కేవలం 37 మంది మాత్రమే రాజీనామా చేశారు. మిగతా 19 మంది రాజీనామాలు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో కావాలనే తమతో రాజీనామాలు చేయించారని ఇప్పటికే రాజీనామా చేసిన వాలంటీర్లు అంటున్నారు. ఈ రాజీనామాల వ్యవహారం పంచాయతీలో చర్చనీయాంశంగా మారింది. సుమారు 15 రోజులు క్రిందటే వాలంటీర్లందరు రాజీనామాలు చేయాలని నాయకులు వారికి ఆదేశించారు. అయినప్పటికీ ఎవరూ మందుకు రాలేదు. దీంతో మళ్లీ ఇటీవలి రెండు రోజులు కిందట నాయకులు సమావేశం పెట్టి రాజీనామాలకు ఒత్తిడి చేసినట్లు తెలిసింది. రాజీనామాలు చేసి ఎమ్మెల్యేతో పాటు జగన్ గెలుపునకు కృషి చేయాలని తెలియజేశారు. మళ్లీ ప్రభుత్వం వచ్చాక మిమ్మల్నే నియమించుకుంటామని చెప్పినట్లు తెలిసింది. రాజీనామాలు చేయకపోతే ప్రభుత్వం వచ్చాక మిమ్మల్ని తీసేస్తామని బెదిరించినట్లు సమాచారం. దీంతో వెంటనే అదే రోజు 25 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. తరువాత గురువారం నాటికి మరో 11మంది రాజీనామా చేయడంతో మొత్తం 37 మంది రాజీనామాలు చేశారు. మిగతా వారు మాత్రం తాము రాజీనామాలు చేసేది లేదని చెబుతున్నారు. మిగతా 19 మంది రాజీనామాలు చేస్తేనే మొదట రాజీనామా చేసిన వారంతా పార్టీ కోసం ప్రచారం చేస్తారని లేదంటే వీరంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేసినా ఆశ్చర్యపడనక్కర్లేదని కొంత మంది చెబుతున్నారు. బలవంతంగా తమతోనే రాజీనామా చేయించి నాయలకు చెందిన 19 మందిపై ఒత్తిడి తీసుకురాలేదని ఇలా అయితే తమ కుటుంబ సభ్యులతో సహా ప్రతిపక్ష పార్టీకి ఓట్లు వేసేస్తామని కొంత మంది వాలంటీర్లు బహిరంగంగానే చెబుతున్నారు. దీనిపై నాయకులు ఏ విధంగా స్పందిస్తారనే దానిపై చర్చ జరుగుతోంది.



భోగాపురంలో రాజీనామా చేసిన వాలంటీర్లు (ఫైల్)

క్రిష్ణపల్లి నుంచి 4 సార్లు అసెంబ్లీకి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలో క్రిష్ణపల్లి ఓ కుగ్రామం. సుమారు 2500 జనాభా ఉన్న గ్రామంలో 1950 ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామం నుంచి ముగ్గురు వ్యక్తులు ఆరుసార్లు అసెంబ్లీకి పోటీ చేశారు. నాలుగు సార్లు విజయబావుటా ఎగురవేశారు. రెండుసార్లు ఓటమి పాలయ్యారు. 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి తరపున యర్రా క్రిష్ణమూర్తి నాయుడు పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మరిశర్ల శివున్నాయుడుపై విజయం సాధించారు. అనంతరం 1997లో యర్రా క్రిష్ణమూర్తి గుండెపోటుతో మరణించారు. అప్పుడు జరిగిన ఉపఎన్నికల్లో ఆయన సతీమణి యర్రా అన్నపూర్ణమ్మ టిడిపి తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మరిశర్ల శివున్నాయుడుపై గెలుపొందారు. మళ్లీ 2009లో టిడిపి తరపున పోటీచేసిన బొబ్బిలి చిరంజీవులు కాంగ్రెస్ అభ్యర్థి సవరపు జయమణి చేతిలో ఓటమిపాలయ్యారు. 2014 ఎన్నికల్లో వైసిపి తరపున పోటీచేసిన జమ్మానపై టిడిపి తరపున మళ్లీ బరిలో దిగిన చిరంజీవులు విజయం సాధించారు. 2019లో టిడిపి నుంచి పోటీచేసిన చిరంజీవులుపై వైసిపి అభ్యర్థి అలజంగి జోగారావు గెలుపొందారు. ఈ గ్రామం నుంచి నాలుగు దఫాలుగా అసెంబ్లీకి ఎన్నికవడం గమనార్హం.

సార్వత్రిక సంగ్రామం

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
శుక్రవారం
19 ఏప్రిల్ 2024

పురాతన పట్టణం.. సాలూరు

సాలూరు.. వేగావతి నది తీరాన వెలిసిన ఓ పట్టణం.. రాష్ట్రంలో అతి పురాతన మున్సిపాలిటీ. దీని కేంద్రంగా 1951లో అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. తొలుత జనరల్ నియోజకవర్గంగా ప్రారంభమై క్రమేణా ఎస్‌టి నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. 72 ఏళ్ల చరిత్ర కలిగిన సాలూరు నియోజకవర్గంలో అభివృద్ధి మూడడుగులు ముందుకు, ఆరడుగుల వెనక్కి అన్న చందంగా తయారైంది. నియోజకవర్గం ఆవిర్భవించిన సమయంలో మొత్తం ఓటర్లు 77,570 మంది. ఇప్పుడు 1,90,619 మంది. సాలూరు మున్సిపాలిటీ, మండలం, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాలతో నియోజకవర్గం ఏర్పడింది. ఇది పూర్తిగా వ్యవసాయ ప్రధాన ప్రాంతం. రైతులు, రైతు కూలీలు అధికంగా ఉన్నారు.

- స్వాతంత్ర్య సమరయోధుల నుంచి ఆదివాసీ నేతల వరకు పాలన
- ఏడు దశాబ్దాల సాలూరు చరిత్ర
- 1978లో ఎగిరిన ఎర్రజెండా
- ఇద్దరు గిరిజన సంక్షేమ శాఖా మంత్రులను అందించిన ఘనత

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు నియోజకవర్గంలో పుష్కలంగా జలవనరులు ఉన్నా వాటిని వినియోగంలోకి తేవడంలో పాలకులు విఫలమయ్యారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందున్న రూపురేఖలు... తర్వాత మారిపోయాయి. 2008 నియోజకవర్గ పునర్ వ్యవస్థీకరణకు ముందు ఈ నియోజకవర్గంలో రామభద్రపురం మండలం ఉండేది. తర్వాత రామభద్రపురం మండలాన్ని బొబ్బిలి నియోజకవర్గంలో విలీనం చేశారు. గజపతినగరం నియోజకవర్గంలో ఉండే మెంటాడ మండలం, పార్వతీపురం నియోజకవర్గంలో ఉండే మక్కువ మండలం.. సాలూరు నియోజకవర్గంలో విలీనమయ్యాయి. నియోజకవర్గంలో రాజకీయాలు పునర్విభజనకు ముందు ఒక విధంగా ఉంటే, తర్వాత మరో విధంగా మారాయి. రామభద్రపురం మండలం సాలూరు నియోజకవర్గంలో ఉన్నంత కాలం టిడిపి ఆధిపత్యం కొనసాగింది. రామభద్రపురం విడిపోయిన తర్వాత టిడిపికి ప్రతికూల పవనాలు మొదలయ్యాయి. 2009 తర్వాత జరిగిన ఎన్నికల్లో వరుసగా టిడిపి అభ్యర్థుల ఓటమి కనిపించింది. అప్పటి నుంచి కాంగ్రెస్, వైసిపి అభ్యర్థుల విజయపరంపర కొనసాగుతోంది. 1952లో జరిగిన ఎన్నికల్లో కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన కూనిశెట్టి వెంకటనారాయణ దొర మొదటి ఎమ్మెల్యే అయ్యారు. 1955 ఎన్నికల్లో అల్లు ఎరుకునాయుడు ప్రజా సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1962లో ఎల్.ఎన్.సన్యాసిరాజు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ ఎమ్మెల్యే అయ్యారు. 1967లో గిరిజన నాయకుడు ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసిన బోయిన రాజయ్య ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1972లో గిరిజన నాయకుడు జన్ని ముత్యాలు కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 1978లో సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్ఆర్‌టిపి వీరపరాజు ఎమ్మెల్యేగా గెలిచి చరిత్ర సృష్టించారు. నియోజకవర్గం చరిత్రలో మొదటి సారి కమ్యూనిస్టు పార్టీ జెండా ఎగిరింది.

1982లో టిడిపి ఆవిర్భావం తర్వాత కొంతకాలం విజయపరంపర కొనసాగింది. 1983లో, 1985లో బోయిన రాజయ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్‌టిఆర్ ప్రభుత్వంలో రాజయ్య గిరిజన సంక్షేమ శాఖ ఉపమంత్రిగా పని చేశారు. 1989లో ఎల్.ఎన్.సన్యాసి రాజు కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 1994, 1999, 2004 ఎన్నికల్లో వరుసగా టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన ఆర్‌పి భంజ్‌దేవ్ విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో భంజ్‌దేవ్ చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి రాజన్నదొర ఓటమి పాలయ్యారు. తర్వాత భంజ్‌దేవ్ ఎస్‌టి కాదని పేర్కొంటూ గిరిజన నాయకుడు రాజన్నదొర హైకోర్టులో కేసు వేశారు. దీనిపై 2006లో హైకోర్టు తీర్పు నేపథ్యంలో భంజ్‌దేవ్ ఎమ్మెల్యే పదవి కోల్పోయారు. రాజన్నదొర ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లు కోర్టు తీర్పు చెప్పింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజన్నదొర విజయ దుందుభి కొనసాగుతోంది. 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్, వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన రాజన్నదొర.. సంధ్యారాణి, భంజ్‌దేవ్‌పై గెలుపొందారు. 2019 ఎన్నికల్లో వైసిపి తరపున మరోసారి పోటీ చేసి రాజన్నదొర విజయం సాధించారు. సాలూరు నియోజకవర్గం నుంచి రాజన్నదొర నాలుగు సార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఐదో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా 2024 ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్నారు. 2009 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా సంధ్యారాణి, కాంగ్రెస్ అభ్యర్థిగా రాజన్నదొర పోటీచేశారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లోనూ వీరిద్దరి మధ్యనే పోటీ ఏర్పడింది. ఇక్కడ త్రిముఖపోటీ ఉన్నప్పటికీ వీరిద్దరి మధ్య ప్రధానంగా పోటీ ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీనియర్ ఎస్‌టి ఎమ్మెల్యేగా రాజన్నదొరకు డిప్యూటీ సిఎం పదవి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి దక్కింది. గిరిజన ఎమ్మెల్యేల్లో డిప్యూటీ సిఎం స్థాయి పదవిని చేపట్టిన మొదటి ఎమ్మెల్యే రాజన్నదొరే కావడం విశేషం. 1985లో టిడిపి ప్రభుత్వ హయాంలో బోయిన రాజయ్య గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ మంత్రిగా పని చేస్తే.. 2019 ఎన్నికల్లో గెలిచిన పీడిక రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, డిప్యూటీ సిఎంగా ఉన్నత శిఖరాలను అధిరోహించారు.

సాలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వారు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
2019	పి.రాజన్నదొర	వైసిపి
2014	పి.రాజన్నదొర	వైసిపి
2009	పి.రాజన్నదొర	కాంగ్రెస్
2004	ఆర్‌పి భంజ్‌దేవ్	టిడిపి
1999	ఆర్‌పి భంజ్‌దేవ్	టిడిపి
1994	ఆర్‌పి భంజ్‌దవ్	టిడిపి
1989	ఎల్‌ఎన్ సన్యాసిరాజు	కాంగ్రెస్
1985	బి.రాజయ్య	టిడిపి
1983	బి.రాజయ్య	టిడిపి
1978	ఎస్‌ఆర్‌టిపి రాజు	సిపిఐ
1972	జన్ని ముత్యాలు	కాంగ్రెస్
1967	బి.రాజయ్య	ఇండి
1962	ఎల్‌ఎన్ సన్యాసిరాజు	ఇండి
1955(ద్వి)	ఎవై నాయుడు	పిఎస్‌పి
	బి.రాజయ్య(ఎస్‌టి)	కాంగ్రెస్
1952	కెవి దొర	కెఎల్‌పి
1952	వి.డి.వి.దేవ్	కాంగ్రెస్

బొబ్బిలి సమరం

- ఐదో విజయం కోసం శంబంగి ప్రయత్నం
- తొలిసారి ఎమ్మెల్యే బరిలో నిలిచిన బేబినాయన

శంబంగి వెంకట చినప్పలనాయుడు

బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

సార్వత్రిక ఎన్నికల్లో బొబ్బిలి నియోజకవర్గంలో టిడిపి, వైసిపి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఐదోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించడం కోసం వైసిపి అభ్యర్థి శంబంగి వెంకట చినప్పలనాయుడు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన.. శంబంగి మరోసారి విజయకేతనం ఎగురవేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. మరోవైపు కూటమి తరపున టిడిపి అభ్యర్థిగా బేబినాయన తలపడుతున్నారు. ఒకసారి పెద్దింటి జగన్మోహన్‌రావు, మూడు సార్లు సుజయకృష్ణ రంగారావు గెలుపు కోసం పని చేసిన బేబినాయన.. తొలిసారి ఎమ్మెల్యే బరిలో నిలిచి, విజయం సాధించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. దీంతో బొబ్బిలి నియోజకవర్గంలో ఇద్దరి మధ్య పోటీ తీవ్ర ఉత్కంఠగా మారింది.

నాలుగు సార్లు విజయం సాధించిన శంబంగి

బొబ్బిలి నియోజకవర్గం నుంచి శంబంగి వెంకట చినప్పలనాయుడు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1983, 1985, 1994 ఎన్నికల్లో టిడిపి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019లో వైసిపి నుంచి ఆయన ఎన్నికయ్యారు. వైసిపి నుంచి రెండోసారి పోటీ చేసి ఐదోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించేందుకు ఎమ్మెల్యే శంబంగి, ఆయన కుటుంబ సభ్యులు, వైసిపి కేడర్ పట్టుదలతో పని చేస్తోంది.

తొలిసారి అసెంబ్లీ బరిలో బేబినాయన

బొబ్బిలి నియోజకవర్గం నుంచి టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బేబినాయన విజయాన్ని సొంతం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. 1999లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన బేబినాయన 1999లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసు అభ్యర్థి పెద్దింటి జగన్మోహన్ రావును బలపరిచి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేసి గెలిపించారు. 2004, 2009, 2014 ఎన్నికల్లో సోదరుడు సుజయ్‌కృష్ణ రంగారావు విజయం సాధించడంలో బేబినాయన కీలకపాత్ర పోషించారు. 2014 ఎన్నికల్లో విజయనగరం ఎమ్‌పి బరిలో నిలిచిన బేబినాయన ఓటమి పాలయ్యారు. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యే బరిలో బేబినాయన నిలిచారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు పైచేయి సాధిస్తారో వేచిచూడాలి.

పాచిపెంట.. గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి

మద్దతుగా గ్రామాల్లో సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

కురుపాం నియోజకవర్గానికి ఇండియా కూటమి అభ్యర్థిగా సిపిఎం తరపున పోటీ చేస్తున్న మండంగి రమణను అభ్యర్థి మెజార్టీతో గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ కోరారు. మండలంలోని రావాడరామభద్రపురంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి రైతులను, కూలీలను, గిరిజనులను, దళితులను, నిరుద్యోగులను మోసగిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్, పెట్టుబడుదారులకు అప్పజెప్పడానికి చూస్తుందని, గిరిజన చట్టాలను కాలరాస్తుందని, గిరిజన హక్కులను పూర్తిగా రాజ్యాంగంలో మార్చివేస్తుందని అన్నారు. జీవో 3 తీసేసి గిరిజనులకు అన్యాయం చేసిందని, 1/70 చట్టాన్ని ఎత్తివేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ఉన్న కొండలను మైనింగ్ పేరుతో కార్పొరేట్ పెట్టుబడులకు అప్పజెప్పడానికి చూస్తుందని తెలిపారు. అలాగే రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేసి గిరిజనులకు, దళితులకు బిసిలకు అన్యాయం చేయడానికి సిద్ధపడిందని ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి విభజన హామీలను నేటికీ అమలు చేయలేదన్నారు. అటువంటి బిజెపితో ఐదేళ్ల పాటు వైసిపి కుమ్మక్కై ప్రభుత్వాన్ని నడిపించిందని, ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన బిజెపితో పొత్తు పెట్టుకుని బిజెపి ప్రమాదాన్ని ఆంధ్ర రాష్ట్రానికి చూపిస్తున్నాయని, కావున ఈ పార్టీలకు రానున్న ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అలాగే ఈనెల 23న సిపిఎం అభ్యర్థి మండంగి రమణ నామినేషన్ కురుపాంలో వేయనున్నారని, దీనికి అధిక సంఖ్య ప్రజలు హాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన, టిడిపి, బిజెపి కూటమిని, వైసిపిని ఓడించాలని, ప్రజల తరపున పోరాడే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థి గెలిపించాలని కోరారు. బిజెపి, వైసిపి హయాంలో అన్నిరకాల ధరలు విపరీతంగా పెరిగాయని, దీంతో సామాన్యుడు బతక లేని పరిస్థితులున్నాయని అన్నారు. విలేకరుల సమావేశంలో ఇండియా కూటమి అభ్యర్థి మండంగి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగనాయుడు, మండల కార్యదర్శి కోరంగి సీతారాం, సిపిఎం రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ, సిపిఐ నాయకులు ప్రసాదరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : రానున్న ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి కొత్తపల్లి గ్రామాల్లో సిపిఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బివి రమణ, కరణం రవీంద్ర మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్నాయని బిజెపి, దాని మిత్రపక్షాలను, బిజెపికి పరోక్షంగా మద్దతు ఇస్తున్న వైసిపిని ఒడించాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకై, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు కృషి చేస్తున్న సిపిఎం అభ్యర్థులను కురుపాం నియోజకవర్గానికి పోటీ చేస్తున్న మండంగి రమణను అలాగే అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న పి.అప్పలనర్సను గెలిపించాలని, కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేష్, ప్రకాష్,సూర్యనారాయణ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు నిదర్శనం అప్పలనరస

పాచిపెంట: ప్రజా సేవకు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం ఇండియా వేదిక బలపరిచిన అరుకు ఎమ్‌పి అభ్యర్థి పాచిపెంట అప్పలనరస అని అటువంటి వ్యక్తిని గెలిపించుకో వాలని సిపిఎం నాయకులు కోరారు. ఆయన్ను గెలిపించాలని కోరుతూ గురువారం మండలంలోని మెట్టవలస, కుడుమూరు, కొత్తవలస, శీల గ్రామాలలో సిపిఎం నాయకులు సూకూరు అప్పలస్వామి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థి అప్పలనరసను గెలిపించాలని కోరారు. నిరంతరం ప్రజల కోసం పనిచేసే అప్పలనరస నిత్యం ప్రజల కోసం అండగా ఉంటారని చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం, నిరంతరం ప్రజలకు అండగా ఉన్న ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తమ అమూల్యమైన ఓటును సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై వేసి పాచిపెంట అప్పలనరసని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస.. ప్రచారంలో భాగంగా ఓ ఇంటి వద్ద మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సుబ్బరావమ్మ

వైసిపి హయాంలో అభివృద్ధి ఏదీ?

టిడిపి పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమం అనేవి రెండు కళ్ల అని, కానీ వైసిపి ప్రభుత్వం సంక్షేమమే తప్ప అభివృద్ధిని పట్టించుకోలేదని విజయనగరం పార్లమెంట్ టిడిపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, నియోజకవర్గ అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. గురువారం అశోక్ బంగ్లాలో 41వ వార్డు నుండి 50వ వార్డులకు సంబంధించి న వార్డు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేటర్ అభ్యర్థులు, యువత కమిటీ, మహిళా కమిటీ, యూనిట్ ఇంచార్జ్, బూత్ ఇన్‌ఛార్జిలతో సమావేశమయ్యారు.

నేడు కలిశెట్టి అప్పలనాయుడు నామినేషన్

విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి టిడిపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం కలెక్టరేట్ లో నామినేషన్ వేయనున్నారు. ఉదయం 10.30లకు విజయనగరం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లా నుంచి కార్యకర్తలు, నాయకులు ర్యాలీ గా బయలు దేరి వెళ్లి కలెక్టరేట్ చేరుకున్న తర్వాత నామినేషన్ పత్రాలను 10.50నిమిషాలకు సమర్పించనున్నారు. అతిది విజయలక్ష్మి మాట్లాడుతూ మమ్మల్ని మమ్మల్నిగా చూడాలని, తన తండ్రితో పోల్చవద్దని అన్నారు. కలిశెట్టి అప్పలనాయుడు సామాన్య కార్యకర్త నుండి ఈరోజు ఎంపి అభ్యర్థి స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. నాయకులు, కార్యకర్తలు టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ పెండింగ్ ఉన్న ప్రాజెక్టులు అన్నీ కూడా పార్టీ అధికారంలోకి వస్తే పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపిరాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటాపోలినాయుడు, బిసి సంఘం రాష్ట్ర నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు, పిళ్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు

వైసిపిలో చేరిన టిడిపి నాయకులు

విజయనగరం టౌన్ : విజయనగరం వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు సమక్షంలో ధర్మపురిలో ఉన్న తన నివాసం వద్ద గరివిడి మండలం దువ్వాం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు ఆ గ్రామ సర్పంచ్ రవి, ఎంపిటిసి కృష్ణవేణి, మండల పార్టీ అధ్యక్షులు కొణిశ కృష్ణం నాయుడు, మీసాల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో వైసిపి లో చేరారు. వీరికి మజ్జిశ్రీనివాసరావు పార్టీ కండువాలు వేశారు.

శివకేశవరావును పార్టీ కండువేసి ఆహ్వానిస్తున్న విజయచంద్ర

టిడిపిలో భారీగా చేరికలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురంలో వైసిపికి చెందిన కార్యకర్తలు, సర్పంచులు టిడిపిలో చేరుతున్నారు. టిడిపిలో చేరగా తాజాగా గురువారం వైసిపి నాయకులు గొట్టాపు శివ కేశవరావు, చనమల్ల వాసుదేవరావు టిడిపి కండువా కప్పుకున్నారు. పార్వతీపురం మండలంలో ఎంఆర్ నగరం సర్పంచ్ వంగపండు లక్ష్మి, ఉపసర్పంచ్ త్రినాథ నాయుడు టిడిపిలో చేరారు. సూడిగం సర్పంచి సూర్యనారాయణ పచ్చ కండువా వేసుకున్నారు. ఎంఆర్ నగర్ నుంచి చాలా మంది కార్యకర్తలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్‌చంద్ర కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

25న గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-బొబ్బిలి

గురుకులాల్లో ప్రవేశాలకు ఈనెల 25న విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ప్రవేశ పరీక్ష జరగనున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5, 6, 7, 8 తరగతుల పరీక్ష, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://aprs.apcfss.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. గంట ముందు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు.

అగ్నిప్రమాద నివారణ పరికరాలు తప్పనిసరి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రతి ఆస్పత్రిలోనూ అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు నివారించేందుకు తగిన పరికరాలు ఉండాలని అగ్నిమాపక కార్యాలయ అధికారి షేక్ మదీనా అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని సంజీవని ఆస్పత్రి వైద్యులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతుల గురించి వివరించారు.

ముక్కాం కూడలిలో చెక్‌పోస్ట్ ఏర్పాటు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముక్కాం వెళ్లే కూడలి వద్ద గురువారం ఎన్నికల చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. నాలుగైదు రోజులకు ఒక్కోచోటకు మార్పు చేస్తామని తెలిపారు. పోలీసులతో పాటు ఇతర శాఖల సిబ్బంది 24 గంటలు వీడియో గ్రాఫ్ ద్వారా తనిఖీ చేస్తారని వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో ఇలాంటివి మూడు చెక్ పోస్టులను జిల్లా ఎన్నికల అధికారి నియమించారని చెప్పారు.

యువతకు ఆదర్శం పృథ్వీరాజ్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఇటీవల విడుదలైన సివిల్స్ పరీక్ష తుది ఫలితాల్లో 493 ర్యాంక్‌తో ఐఎఎస్ సాధించిన దొనక పృథ్వీరాజ్ నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని పార్వతీపురం ఎంఇఒ సామల సింహాచలం అన్నారు. మండలంలోని ఎమ్మార్ నగరం జెడ్పి హై స్కూల్ హెచ్ఎంగా పనిచేస్తున్న దొనక విజయ్ కుమార్ కుమారుడు పృథ్వీరాజ్ ఐఎఎస్ సాధించిన సందర్భంగా గురువారం వారి ఇంటికి వెళ్లి ఆయనకు పూలమాల వేసి అభినందించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ పృథ్వీరాజ్ ఐఎఎస్ సాధించడం పార్వతీపురానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సీతానగరం ఎంఇఒ ముప్పల వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

పృథ్వీరాజ్‌ను అభినందిస్తున్న సింహాచలం

త్వరితగతిన గర్భిణుల వివరాల నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గర్భిణుల నమోదు త్వరితగతిన జరగాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు ఆదేశించారు. పార్వతీపురం, గరుగుబిల్లి మండలాలకు చెందిన పిహెచ్‌సిల వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని స్థానిక ఎన్‌జిఒ భవనంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణికి పూర్తి స్థాయిలో, ఖచ్చితమైన వైద్య సేవలందాలంటే క్షేత్ర స్థాయిలో ఈసి (అర్హులైన జంట)ని గుర్తించి, సకాలంలో గర్భనిర్ధారణ పరీక్షలు జరిపించాలన్నారు. గర్భిణుల నమోదు (రిజిస్ట్రేషన్) త్వరగా మొదటి త్రైమాసంలోనే చేయాలని, అందుకు అవసరమైన పూర్తి వివరాలు మాతాశిశు సంరక్షణ కార్డులో పొందుపర్చాలని సూచించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా గుర్తించిన గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రతీ రోజూ ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు వేసుకునే విధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. అవసరమైన ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్స్ ఇవ్వాలని, అంగన్వాడీ కేంద్రంలో గర్భిణికి అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలియజేసారు. ప్రిజం10 అమలు తీరును పర్యవేక్షించాలని వైద్యాధికారులకు సూచించారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహారలోపం, శ్వాస సంబంధమైన సమస్యలున్న వారిని త్వరగా గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని, సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఫీవర్ సర్వలెన్స్ పై దృష్టి సారించి, అవసరమైన వారికి జ్వర నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. వడదెబ్బ, వేసవి జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని సూచించారు. ఎఫ్‌డిపి, ఆరోగ్య సురక్ష, కంటి వెలుగు కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ఆరోగ్య కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ముఖ్యంగా మాతా,శిశు మరణాల నివారణకు కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఐఒ డాక్టర్ నారాయణ రావు, డిఎంఒ డాక్టర్ టి. జగన్ మోహనరావు, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, ఎఫ్‌డిపి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, ఎస్ఒ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లేని నగరంగా తీర్చిదిద్దుతా : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వేణుగోపాలపురంలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో సుపరిపాలన సాగిందన్నారు. అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు చేరాయని చెప్పారు. ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి డివిజన్ మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కోలగట్ల వీరభద్ర స్వామి గత 5 ఏళ్ళుగా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాలలో పాలుపంచుకున్నారన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, వైసిపి నాయకులు ఎస్‌వివి రాజేష్, ముచ్చు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలపురంలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి కోలగట్ల

వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణంలోని శివాలయం వీధిలోని పైడితల్లి దేవస్థానానికి (దత్తాలయం) చెందిన వెంకటేశ్వర స్వామికి అలంకరణ కోసం గురువారం బాలాజీ భక్తమహిళా సమాజం భక్తులు ఒకకేజి 225గ్రాములు గల వెండి బుట్ట కిరీటం అందజేశారు. కిరీటం దేవస్థానం సీనియర్ సహాయకులు ఏడుకొండలకు సమాజం సభ్యులు అందజేశారు.

21న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 21న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సాధన యువ జన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గా ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జర జాపు పేటలో సాధన యువ జన సంఘం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారని వెల్లడించారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తారన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం తీసుకురావాలని కోరారు.

నేడు శంబంగి నామినేషన్

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి బొబ్బిలి అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. నామినేషన్ సందర్భంగా వైసిపి కార్యాలయం నుంచి పట్టణంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసభకు వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు హాజరు కానున్నారు. నామినేషన్ కార్యక్రమానికి పెద్దఎత్తున జన సమీకరణ చేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

విజయనగరంకోట : విజయనగరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సుంకరి సతీష్ కుమార్ నామినేషన్ వేయనున్నారు.

మీసాల గీత నామినేషన్

విజయనగరం అసెంబ్లీ నియోజక వర్గం స్వతంత్ర అభ్యర్థిగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత నామినేషన్ వేయనున్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణ ఏర్పాటుకు ఈ కవాతును నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. మండలంలోని మరిపల్లి, తోనాం, కందుల పదం, మామిడిపల్లి గ్రామాల్లో సాలూరు రూరల్ ఎస్ఐ మామిడి వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు.

29నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ

ప్రజాశక్తి గరుగుబిల్లి

విద్యార్థులకు వేసవిలో ఇవ్వనున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి మధుసూదనరావు అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ శాఖ ఆధీనంలో ఉన్న అన్ని గ్రంథాలయాలలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి జూన్ 7 వరకూ 39 రోజులు పాటు ఈ వేసవి శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో పిల్లలకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తామని చెప్పారు. ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి
శుక్రవారం 19 ఏప్రిల్ 2024

వంతెన పనులు ఎప్పటికి పూర్తయ్యేనో?

పాలకులు మారినా నెరవేరని హామీ

అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలో సువర్ణముఖీ నదిపై 36వ రాష్ట్రీయ రహదారిపై అనుసంధానంలో నిర్మిస్తున్న నూతన నిర్మాణ పనులు ఎప్పటికీ పూర్తవుతుందోనని స్థానికులు, ప్రయాణికులు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడు తెలుగుదేశం, నేడు వైసిపి ప్రభుత్వాలు మారినా వంతెన నిర్మాణ పనులు మాత్రం పూర్తి కావడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ నదిపై వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం మారాక 2020 జులైలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. స్తంభాల నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేశారు. శ్లాబ్‌లు నిర్మాణ పనులు ప్రారంభించేసరికి గుత్తేదారుకు బిల్లులు అందక అర్ధాంతరంగా పనులను నిలిపివేశారు. పనులు పూర్తిగా నిలిపివేయకూడదన్న ఉద్దేశంతో వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డును పూర్తి చేశారు. అప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తిగా నిలిపివేశారు. దాదాపు 14 నెలలుగా పనులు ఉసేలేదు. దీంతో శిథిలావస్థలో ఉన్న పాత వంతెనపైనే భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలకు రోజుకు 2500 వాహనాలు పైబడే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పాత వంతెన ఎప్పుడు కూలిపోతుందని ఆందోళన చెందుతున్నారు. పాత వంతెనలపై 20 టన్నులకు పైబడి మించి బరువు ఉన్న వాహనాల రాకపోకలు నిషేధించినప్పటికీ అరవై టన్నులు పైబడిన బరువుతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. నియోజకవర్గంలో రోడ్లు, కాలువలు అభివృద్ధి చేశామంటూ చెబుతున్న పాలకులు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే బ్రిడ్జి నిర్మాణం పట్ల ఎందుకంత నిర్లక్ష్యమని ప్రశ్నిస్తున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన వ్యయ పరిశీలకులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను శాసన సభ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్ గురువారం సందర్శించారు. జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఎన్నికల ప్రవర్తన నియమావళి విభాగం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్, సోషల్ మీడియా విభాగం, వ్యయ విభాగం, పిర్యాదులు విభాగం, చెక్ పోస్టుల పర్యవేక్షణ నియంత్రణ విభాగం, జియో టాగింగ్ వాహనాల పర్యవేక్షణ విభాగం తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పార్వతీపురం, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించి పరిశీలించారు. జెసి, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్ శోభిక కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరును వివరించారు. తొలుత జిల్లా కలెక్టర్ చాంబార్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్ఒ నిశాంత్ కుమార్‌ను కలుసుకున్నారు. వీరిని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవ నాయుడు, కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారి, ఎస్డిసి ఆర్‌వి సూర్యనారాయణ, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ప్రచార ఖర్చులను అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్ అన్నారు. గురువారం ఆయన పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి సమక్షంలో వ్యయ పరిశీలన బృందాలతో సమావేశం నిర్వహించారు. వ్యయాన్ని ఎలా నమోదు చేస్తున్నారని అడిగారు. ధరల పట్టికను పరిశీలించారు. వ్యయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీరామ్మూర్తి, లైజన్ అధికారి కృష్ణ, వ్యయ పరిశీలన బృందాలు పాల్గొన్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంతో పాటు గడగమ్మ, కొంచ, చేబియ్యంవలస, డిపి వలస, దువ్వనపాడు తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం మండల నాయకులు ఎన్.సింహాచలం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రోజురోజుకు ఎండలు తీవ్రతంగా ఉండడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో గొంతును తడుపుకునేందుకు గుక్కెడి నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా కుళాయి పాయింట్లు ఏర్పాటు చేసినా కనీసం వాటి ద్వారా చుక్క నీరు వచ్చే దాఖలాల్లేవన్నారు. కోట్లాది రూపాయలతో వెచ్చించి చేపట్టిన పనులు మూలకు చేరాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దౌర్జన్యంగా రహదారి తొలగింపు

- రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- దబ్బగెడ్డ, డికె పట్నం మధ్య పదేళ్ల క్రితం రోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి - మక్కువ

పట్టపగలు, మిట్ట మధ్యాహ్నం అందరూ చూస్తుండగానే జెసిబి లతో దౌర్జన్యంగా రహదారి తొలగింపు చేపట్టడం ఒకంత ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంత జరుగుతున్నా ఏమీ కాదులే అన్నట్టుగా అధికారులు పట్టించుకోకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుందనడంలో ఎటువంటి అతిశయోక్తి కాదు. మక్కువ, పార్వతీపురం మండలాల రాకపోకలకు అత్యంత తక్కువ దూరంలో ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 2014లో ఉపాధి హామీ చట్టం కింద పార్వతీపురం మండలం బుదిరివాడ పంచాయతీ పరిధిలోని డికె పట్టణం నుండి మక్కువ మండలం దబ్బగెడ్డ పంచాయతీ కొట్టంగి వలస రహదారి జంక్షన్ వరకు సుమారు నాలుగున్నర కిలోమీటర్ల మేర అంతర్ మండల రహదారి నిర్మించారు. తొలిత మట్టి రోడ్డు నిర్మాణం చేపట్లగా, మరో రెండేళ్ల తర్వాత కొంతమేరకు గ్రావెల్ మెటల్ రోడ్డు నిర్మాణాన్ని కూడా పూర్తి చేశారు. అప్పట్లో బిటి రోడ్డుకు అంచనాలు వేసినప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో సుమారు రూ.పది లక్షల వరకు ఈ రహదారికి వెచ్చించారు. బుధవారం కానామెట్ట సమీపంలో విజయరాంపురం రెవెన్యూ పరిధిలోని ఖాతా నెంబర్ 201 ఇటీవల జరిపిన భూముల రీసర్వేలో ఈ రహదారి తన జిరాయితీలో ఉందని, ఓ మహిళా రైతు ఈ రోడ్డును తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అనుకున్నదే తడువుగా ప్రభుత్వ నిబంధనలలేవీ పాటించకుండా

జెసిబితో రోడ్డు తవ్వేస్తున్న దృశ్యం

జెసిబితో సుమారు 100 మీటర్ల మేర తొలగించారు. గురువారం ఒడిశాలోని కస్పావలస వారపు సంతకు వెళ్లేందుకు మక్కువ మండల ప్రజలు ఈ రహదారి బాగోకపోవడంతో అనేక అవస్థలు పడ్డారు. అలాగే శుక్రవారం జరిగే వారపుసంత కూడా మక్కువ మండల కేంద్రానికి పార్వతీపురం ఒడిశా సరిహద్దు గ్రామాల గిరిజనులు అధిక సంఖ్యలో ఈ రహదారి గుండా ప్రయాణించాల్సి ఉంది. ఒడిశా-పార్వతీపురం ఏజెన్సీ గ్రామాలను మక్కువ మండల కేంద్రానికి దగ్గర చేయడంలో ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే రైతులకు, వ్యాపారులకు వాణిజ్య అవసరాలకు కూడా ఈ రహదారి గుండా వాహనాలను వినియోగిస్తూ ఉంటారు. ప్రస్తుతం ఈ రహదారి తొలగింపుతో వీరంతా అవస్థలు గురికాక తప్పని పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన చెందుతున్నారు. సదరు రైతు పార్వతీపురానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అండ చూసుకొనే ఈ రోడ్డును తవ్వేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి రహదారిని యధావిధిగా నిర్మించాలని పలువురు కోరుతున్నారు

మా జిరాయితీలో ఉందని చెప్పినా వినలేదు..

గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని నిర్మించారు. ఈ రహదారి నిర్మాణం వల్ల సుమారు 45 సెంట్లు భూమిని కోల్పోయాం. ఎం.గౌరమ్మ పేరున ఆరు ఎకరాల 60 సెంట్లు భూమిని రీసర్వే చేయగా అసలు విషయం బయట పడిందని గౌరమ్మ పెద్ద కుమార్తె తవిటి రాజు ప్రజాశక్తి తెలిపారు. అప్పట్లో ప్రభుత్వ భూమిని నమ్మబలికారని, తమకు అవగాహన లేనందున ఏమీ చేయలేకపోయామని తెలిపారు. డికె పట్నం, దబ్బగెడ్డ పంచాయతీల పెద్దల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లామన్నారు. అధికారులెవరికీ తెలియపరచలేదని, ప్రభుత్వ భూముల్లో మళ్లీ యధావిధిగా రహదారిని సొంత డబ్బులతో నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

బి-ఫారం అందుకున్న జయకృష్ణ

ప్రజాశక్తి-పాలకొండ

పవన్ కల్యాణ్ చేతుల మీదుగా బి-పారం అందుకుంటున్న జయకృష్ణ

పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి జనసేన తరపున పోటీ చేస్తున్న జయకృష్ణ గురువారం అమరావతిలో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా బి-ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌తో పాలకొండ నియోజకవర్గ పరిస్థితులు చర్చించారని తెలుస్తుంది. అందర్నీ కలుపుకుని పోవాలని, ఎన్నికల్లో జనసేన జెండా ఎగురవేసి అసెంబ్లీలో అడుగుపెట్టాలని జయకృష్ణకు పవన్ కల్యాణ్ సూచించినట్టు తెలుస్తోంది.

ఏజెన్సీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చంటిబాబు

ముమ్మరంగా కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

కాంగ్రెస్ అభ్యర్థి సవర చంటిబాబు ప్రచారంలో దూసుకుపోతున్నారు. మండలంలోని దోనుబాయి, సీది, సామరెల్లి, పుబ్బడ, అంటికొండ తదితర గిరిజన గ్రామాల్లో గురువారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టో యువతకు వివరించారు. హస్తం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ అని అన్నారు. ప్రచారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిడ్డిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

4జి పరికరాల పంపిణీలో నిర్లక్ష్యం తగదు

గుమ్మలక్ష్మీపురం : 4 జి పరికరాల సరఫరాలో నిర్లక్ష్యం తగదని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అలుగు వెంకట్రావు ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. తయారీ సమస్యతో టిసిఎస్ సంస్థ నుంచి ఎంతో కాలంగా ఫోర్ జి పరికరాల సరఫరా కావడం లేదన్నారు. సాంకేతిక సమస్యలు అధిగమించడానికి నోకియా, జిటిఇ వంటి సంస్థలను టిసిఎస్ సాయం కోరినట్లు వార్తలొచ్చాయన్నారు. నెట్‌వర్క్ సమస్యతో ఇటీవల నెలకు 10 లక్షల మంది వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ విడిచిపెట్టారని, మరింత మంది విడిపోయే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులకు ఫోర్ జీ సేవలు అందించేందుకు తాత్కాలికంగా వినియోగానికి ఐడియా నెట్వర్క్ వినియోగానికి బిఎస్ఎన్ఎల్‌కు అనుమతించాలని డిమాండ్ చేశారు. దీనిపై బిఎస్ఎన్ఎల్ స్పందించడం లేదని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

దోనుబాయి పిహెచ్‌సిలో విచారణ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుభాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భానుప్రతాప్‌పై ఆ పిహెచ్‌సి సిబ్బంది కొద్ది రోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ డిఎం హెచ్ఒ శివకుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. వైద్యాధికారి భానుప్రతాప్‌పై వచ్చిన ఫిర్యాదుపై ఆరోగ్య కేంద్ర సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. భానుప్రతాప్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి అనంతరం నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తానని డిప్యూటీ డిఎంహెచ్ఒ తెలిపారు.

విచారణ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్

తొలిరోజు ఒకటే నామినేషన్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యంజిల్లాలో తొలిరోజు గురువారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైంది. అరకు పార్లమెంట్ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా ఎవరూ వేయలేదు. నాలుగు అసెంబ్లీస్థానాలకు గాను కురుపాంలో స్వతంత్ర అభ్యర్థిగా నిమ్మక జయరాజు నామినేషన్ వేశారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను సీతంపేట ఐటిడిఎ పిఒ, పాలకొండ ఆర్ఒ కల్పనాకుమారి, పార్వతీపురం ఐటిడిఎ పిఒ, సాలూరు ఆర్ఒ సి.విష్ణు చరణ్, పార్వతీపురం ఆర్‌డిఒ, ఎన్నికల ఆర్ఒ అధికారి కె.హేమలత, పాలకొండ ఆర్‌డిఒ, కురుపాం ఆర్ఒ వి.వెంకట రమణ తమ నియోజకవర్గాల్లో విడుదల చేశారు. ఈసందర్భంగా ఎన్నికల నోటిఫికేషన్ వివరాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయ నోటీస్ బోర్డులో పొందుపరిచారు.

నేడు రాజన్నదొర సాధారణంగా దాఖలు

సాలూరు : అసెంబ్లీ, సాధారణ ఎన్నికల సమరంలో తొలి ఘట్టం గురువారం ప్రారంభమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్ దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ను విడుదల చేశారు తొలిరోజు ప్రధాన పార్టీల అభ్యర్థులెవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. అభ్యర్థులు వారి జాతకాలు, ముహూ ర్తాల ఆధారంగా నామినేషన్ దాఖలు చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా డిప్యూటీ సిఎం రాజన్నదొర వైసిపి అభ్యర్థిగా ఈనెల 19న నామినేషన్ దాఖలు చేయనున్నారు. రెండోసారి 24న భారీ జనసమీకరణతో కలిసి నామినేషన్ దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. టిడిపి అభ్యర్థి సంధ్యారాణి కూడా 20న తొలివిడత నామినేషన్ సాదాసీదాగా దాఖలు చేయనున్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభం కావడంతో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ డిఎస్‌పి మురళీధర్ ఆధ్వర్యాన ముగ్గురు సిఐలు విహెచ్.వాసు నాయుడు, బాలకృష్ణ, నారాయణరావు నాయకత్వం లో పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. ఆర్వో కార్యాలయానికి 500 మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలు మూసివేయాలని పోలీసులు సంబంధించిన దుకాణ యజమానులను ఆదేశించారు.

100 మీటర్ల దూరంలో బారికేడ్లు

సీతంపేట : అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వచ్చే ర్యాలీని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే ఆపివేయాలని పాలకొండ డిఎస్పీ జివి కృష్ణారావుకు ఆర్ఒ కల్పనకుమారి సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్ ఏ మహేశ్వరరావుసీఐ, చంద్రమౌళి ఎస్ఐ జగదీష్ నాయుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోణీ పడలేదు

పాలకొండ : నియోజకవర్గానికి సంబంధించి మొదటి రోజైన గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. గురువారం నుంచి నామినేషన్ స్వీకరణకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ నామినేషన్ వేసేందుకు ఎవరూ రాలేదు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కెవి తోటపాలెం సబ్ స్టేషన్‌లో లోడును సవరించేందుకు కొత్తగా ఏర్పాటు చేయబోయే 11కెవి ఫీడర్ బ్రేకర్‌కు సంబంధించిన కెవి లైను పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ బ్యాంక్, ట్యాంక్ బండ్ , తోటపాలెం రామాలయం, 11 కెవి బ్యాంక్ కాలనీ ఫీడర్ మీద ఉన్న బ్యాంక్ కాలనీ, శ్రీనివాస కాలేజీ , మయూరి జంక్షన్ తదితర ప్రదేశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. బాలాజీ నగర్ , వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర ప్రాంతాలకు, నాయుడు కాలనీ ఫీడర్ మీద ఉన్న నరసింహనగర్ , నాయుడు కాలనీ, కళ్యాణ్‌నగర్‌కు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు .11 కెవి సింగపూర్ సిటీ ఫీడర్, 11 కెవి డెంకాడ ఫీడర్ విభజన పనులు వల్ల సింగపూర్ సిటీ, జమ్ము, నారాయణపురం, పడాలపేట, పెద తాడివాడ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు.

పోలీసు సంక్షేమ పాఠశాలలో మూడు ఉద్యోగాల భర్తీకి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎఆర్ పోలీసు లైన్స్ నడుపుతున్న పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న మూడు ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మ్యాథ్మెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయాలజీతోపాటు ఇంగ్లీషు సబ్జెక్ట్‌ను కూడా భోదించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతను తెలిపే ఒరిజినల్ ధవ పత్రాలను,బయోడేటాను ఈనెల 26 ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించబోయే టీచింగు డెమో , మౌఖిక పరీక్షకు హాజరుకావాలని తెలిపారు.వివరాలకు హెచ్ఎం 9491799315 లేదా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ - 9121109485, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ - 9121109484 ను సంప్రదించ వచ్చునని తెలిపారు.

53 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం మండల పరిధిలో 53 మంది వాలంటర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను అధికారులకు అందజేసి విధుల నుంచి తప్పుకున్నట్లు వెల్లడించారు. కొండకరకం నుండి 12 మంది, గుంకలాం నుండి 14, ద్వారపూడి 13, నారాయణపురం 7, ముడుదాం నుండి ఏడుగురు రాజీనామాలు చేశారు. నగర పరిధిలో 37వ డివిజన్ బీసీ కాలనీ నుండి 15 మంది, మూడో డివిజన్ పూల్‌బాగ్ నుండి 8 మంది, 14వ డివిజన్ కుమ్మరి వీధి నుంచి 18 మంది, 17వ డివిజన్ పుచ్చల వీది నుండి పదిమంది రాజీనామాలను సమర్పించారు.

ఎస్.కోటలో రెండు నామినేషన్లు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తొలిరోజు గురువారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి మురళీకష్ణ తెలిపారు. ఒకటి స్వతంత్ర అభ్యర్థిగా కొట్యాడ లోకాభి రామకోటి నామినేషన్ వేయగా, ఇంకొకరు జాతీయ జనసేన పార్టీ నుండి యాళ్ల వెంకట్రావు నామినేషన్ వేసినట్లు తెలిపారు.

నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న రామకోటి

జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రాజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. వీరిని జెడ్‌పి అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని ఎన్నికల పరిస్థితిని, తీసుకున్న చర్యలను వివరించారు. వీరి వెంట లైజాన్ ఆఫీసర్లు కూడా ఉన్నారు.

జిల్లా ఎన్నికల పరిశీలకులు వీరే

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు, ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేసేందుకు ఆరుగురు ఎన్నికల పరిశీలకులు నియమితులయ్యారు. వీరిలో ముగ్గురు సాధారణ పరిశీలకులు కాగా, మిగిలిన ముగ్గురూ వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారు. వీరికి అన్నివిధాలా సహాయ సహాకారాలను అందించేందుకు, అవసరమైన సమాచారాన్ని ఇచ్చేందుకు ఏడుగురు లైజనింగ్ అధికారులను, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నియమించారు. గజపతినగరం, నెల్లిమర్ల,విజయనగరం ని యోజకవర్గాలకు సాధారణపరిశీలకుగా హనీష్ ఛాబ్రా, లైజనింగ్ అధికారిగా వ్యవసాయశాఖ జెడి విటి రామారావు నియమితులయ్యారు.ఎచ్చెర్ల, రాజాం, బొబ్బిలి, చీపురుపల్లి నియోజకవర్గాలకు సాధారణ పరిశీలకుగా పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, లైజనింగ్ అధికారిగా బొబ్బిలి గ్రౌండ్‌వాటర్ డిడి ఎన్.వి.కె దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. శృంగవరపుకోట నియోజకవర్గానికి పరిశీలకులుగా సీతారాం జాట్, లైజనింగ్ అధికారిగా హౌసింగ్ డిఇ జివి రంగారావు నియమితులయ్యారు.

వ్యయ పరిశీలకులు వీరే

ప్రభాకర్ ప్రకాష్ రాజన్ (విజయనగరం పార్లమెంట్) , ఆనంద్‌కుమార్ (రాజాం, బొబ్బిలి, చీపురుపల్లి), ఆకాష్ దీప్ (నెల్లిమర్ల, విజయనగరం, ఎస్.కోట)నియమితులయ్యారు.

అరకు ఎమ్‌పి నియోజకవర్గ వ్యయ పరిశీలకులుగా గుర్ కరణ్ సింగ్

పార్వతీపురంరూరల్ : పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులుగా గుర్ కరణ్ సింగ్‌ను ఎన్నికల సంఘం నియమించింది. గురువారం జిల్లాకు చేరుకోనున్నారు.

వ్యయ పరిశీలకులను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్‌పి

ఉద్యానవన కళాశాల అతిథి గృహంలో బస చేయనున్నారు. వ్యయ పరిశీలకుల ఫోన్ నంబరు 9346127368 కాగా, వ్యయ పరిశీలకుల సమన్వయ అధికారిగా జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ (8331056166) వ్యవహరిస్తున్నారు. వ్యయ సంబంధిత అంశాలపై సమాచారం, ఫిర్యాదులు సమర్పించవచ్చని ఆయన తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులుగా రమాకాంత్ ప్రధాన్

జిల్లాలో నాలుగు శాసన సభ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులుగా రమాకాంత్ ప్రధాన్‌ను ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు గురువారం ఆయన జిల్లాకు చేరుకున్నారు. ఉద్యానవన కళాశాల అతిథి గృహంలో బస చేస్తున్నారు. వ్యయ పరిశీలకుల ఫోన్ నంబరు 9346163053 కాగా, వ్యయ పరిశీలకుల సమన్వయ అధికారిగా జిల్లా బిసి సంక్షేమ, సాధికారిత అధికారిగా ఎస్.కృష్ణ (8179817653) వ్యవహరిస్తున్నారు. వ్యయ సంబంధిత అంశాలపై సమాచారం, పిర్యాదులు సమర్పించవచ్చని కృష్ణ తెలిపారు.

టిడిపిలో చేరిన తాడ్డి

ప్రజాశక్తి-మెరక ముడిదాం

మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి కీర్తి శేషులు తాడ్డి కృష్ణారావు కుమారుడు తాడ్డి చంద్రశేఖర్, చీపురుపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు ఆధ్వర్యంలో గురువారం టిడిపిలో చేరారు. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సుమారు మూడు వందల కుటుంబాలు వైసిపిని వీడి తెలుగుదేశంలో చేరాయి. ఈ సందర్భంగా కళా వెంకటరావు మాట్లాడుతూ సముద్రం ఉప్పొంగి పోయేలా వచ్చిన జనాన్ని చూస్తే రాష్ట్రంలో వైసిపి మట్టి కరవడం ఖాయమని అనిపిస్తుందని అన్నారు. వైసిపి నాయకులను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయించడం తప్ప మంచి ఏమీ జరగ లేదని తెలిపారు. మద్యం ద్వారా లక్ష ముప్పై వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ధరలు ఆకాశాన్ని అంటాయని, దోచుకోవడం, గుద్దులు గుద్దడం తప్పించి చేసేదేమీ లేదన్నారు. ఇలాంటి దుష్ట పాలన మనకు అవసరమా అని ప్రశ్నించారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోనికి వస్తే ఇరువై లక్షల ఉద్యోగాలు, మహిళలకు ప్రత్యేక నిధులు కేటాయించడం, ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని తెలిపారు. మంచి సుపరి పాలన కావాలంటే రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రి కావాలని, మెరక ముడిదాం నుండి అత్యధిక మెజారిటీతో టిడిపి అభ్యర్థిని అయిన నన్ను గెలిపించాలని కోరారు. కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతిలాల్ నాయుడు, కె. త్రిమూర్తులురాజు, కిమిడి మల్లిక్ నాయుడు, రౌతు రమేష్ నాయుడు, కోట్ల సుగుణాకరరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కెంగువ ధనంజయ, భైరిపురం మాజీ ఎంపిటిసి మంత్రి సీతం నాయుడు, జనసేన, బి జెపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న కళా వెంకటరావు